సాక్షి జగిత్యాల

మంగళవారం । 29 । ఆగస్టు । 2023

'కొండంత' భక్తులు

మల్లాపూర్(కోరుట్ల): శ్రావణంలో రెండోసోమవారం సందర్భంగా స్థానిక శ్రీకనక సోమేశ్వర ఆలయం భక్తులతో పోటెత్తింది. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల నుంచి వేలాది మంది తరలివచ్చి కొండపైన కొనేటిలో పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామివారికి వరదపాశాన్ని నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.


ఆలయంలో భక్తుల ప్రదక్షిణలు

న్యూస్‌రీల్

జిల్లా ఎన్నికల అంబాసిడర్‌గా విరంచి స్వప్నిక


స్వప్నికను సన్మానిస్తున్న కలెక్టర్ తదితరులు

ధర్మపురి: అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాలుగు బంగారు పతకాలు సాధించి భారత త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన పట్టణంలోని రంగు విరంచి స్వప్నికను జిల్లా ఎన్నికల అంబాసిడర్‌గా నియమించినట్లు కలెక్టర్ యాస్మిన్‌బాషా సోమవారం తెలిపారు. ఈ మేరకు స్వప్నికను తన కార్యాలయంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో కలిసి సన్మానించారు. ఓటుహక్కు వినియోగంపై ప్రచార బాధ్యతలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.

నిత్య 'జనగణమన' ప్రారంభం


జాతీయ గీతాలాపనలో గ్రామస్తులు

మల్యాల(చొప్పదండి): రాంపూర్‌లో సోమవారం నిత్య జనగణమన జాతీయ గీతాలాపన ప్రారంభమైంది. జెడ్పీటీసీ కొండపల్కల రాంమోహన్, సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభించారు. గ్రామస్తుల సహకారంతోరూ.52,700 విరాళాలు సేకరించి ఊరు నాలుగువైపులా ఆరు మైకులు ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మైక్‌సెట్‌ను జెడ్పీటీసీ రాంమోహన్‌రావు రిబ్బన్ కట్ చేసి, ప్రారంభించారు. సోమవారం ఉదయం 9.15గంటలకు జాతీయ గీతాలాపన చేశారు.

పర్సు అప్పగింత


పర్సు అప్పగిస్తున్న ప్రజాప్రతినిధులు

కథలాపూర్(వేములవాడ): పోసానిపేట గ్రామంలో హోటల్ నిర్వాహకురాలు రాగుల సరోజన తనకు దొరికిన పర్సును తిరిగి అప్పగించి నిజాయితీని చాటుకున్నారు. దర్శనాల లతీశ్ ఆదివారం ఉదయం సరోజన హోటల్ వద్ద టీ తాగి వెళ్లిపోయాడు. కాసేపటి తర్వాత పర్సు పోయిందని పలు చోట్ల వెతికాడు. అయినా, లభించలేదు. సోమవారం ఉదయం హోటల్ నిర్వాహకురాలు సరోజ కుర్చీలను శుభ్రం చేస్తుండగా.. పర్సు దొరికింది. దానిని సర్పంచ్ మిట్టపెల్లి గంగారెడ్డి, ఉపసర్పంచ్ బత్తుల అశోక్ ద్వారా లతీశ్‌కు అప్పగించారు. పర్సులో డబ్బులు, ఏటీఎం కార్డులు, పాన్‌కార్డు యథావిధిగా ఉన్నాయని, పర్సును అప్పగించిన సరోజకు లతీశ్ కృతజ్ఞతలు తెలిపాడు.

సైనికుల్లా పనిచేయాలి


కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

రాయికల్(జగిత్యాల): కాంగ్రెస్ బలోపేతానికి యువకులు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. ఇటిక్యాలకు చెందిన యువకులు ఎమ్మెల్సీ సమక్షంలో సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తెల్లరేషన్‌కార్డుదారుల ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు, దళితులకు అదనంగా రూ.6 లక్షలు సాయం చేస్తామని, రాయికల్‌లో డిగ్రీ కళాశాల మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీటీసీ రాధ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రావు ఉన్నారు.


31లోగా దరఖాస్తు చేయండి

జగిత్యాల: నోటరీపై కొనుగోలు చేసిన పట్టణ ప్రాంత వ్యవసాయేతర భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబరు 84 ద్వారా వెసులుబాటు కల్పించిందని, అర్హులైన వారు అక్టోబర్ 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ యాస్మిన్‌బాషా సూచించారు. నగరపాలక సంస్థ, మున్సిపాలిటీల్లో నోటరీ ఆధారంగా భూములు కొనుగోలు చేసినవారు మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 125 చదరపు గజాల్లోపు స్థలం ఉంటే ఉచితంగా రెగ్యులరైజ్ చేస్తామని, అంతకుమించి ఉంటే మార్కెట్ ధరల ప్రకారం స్టాంప్ డ్యూటీ, పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకునే సమయంలో నోటరీ డాక్యుమెంట్ తోపాటు, ఆ భూమికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్లు, ఆస్తిపన్ను, కరెంట్ బిల్లు, నీటిపన్ను రశీదు, ఇతర ఆధారాలు దరఖాస్తుకు జత చేయాలన్నారు. వీటిద్వారా పూర్తి యజమాన్య హక్కులు లభిస్తాయని, తద్వారా సులభంగా క్రయవిక్రయాలు జరుపుకోవచ్చన్నారు.

జ్వరాలతో విలవిల

పేషెంట్లతో ఆస్పత్రులు కిటకిట

- అప్రమత్తమైన వైద్య, ఆరోగ్య శాఖ
- సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు
- డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో శిబిరాలు
- జ్వరపీడితులకు మెరుగైన వైద్యసేవలు



ధర్మపురి/కోరుట్ల: మొన్నటివరకు కురిసిన ఎడతెరిపిలేని వర్షాలు ఒకవైపు.. లోపించిన పారిశుధ్యం మరోవైపు.. నీటినిల్వల్లో వృద్ధి చెందుతున్న దోమలు ఇంకోవైపు.. వెరసి జిల్లాలోని ధర్మపురి, రాయికల్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఒక్కో బల్దియాలో రోజూ వందల సంఖ్యలో పేషెంట్లు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇందులో ప్రధానంగా వైరల్, టైఫాయిడ్‌తో బాధపడేవారు అధికంగా ఉంటున్నారు. అప్రమత్తమైన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు నియంత్రణ చర్యలు వేగవంతం చేశారు. డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో ఆగమేఘాలపై వైద్యశిబిరాలు నిర్వహిస్తూ ఇంటింటా వైద్యపరీక్షలు చేసి బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు.

ధర్మపురిలో..

- స్థానిక వైద్య, విధాన పరిషత్ అధీనంలోని 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో విషజ్వరాలు, వైరల్ ఫీవర్‌తో బాధపడేవారు చాలామంది చికిత్స పొందుతున్నారు. గత జూలై నుంచి ఈనెలలో ఇప్పటివరకు 9,676 మంది అవుట్ పేషెంట్లు, 578 మంది ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందారు. ఇందులో 1,737 మంది జ్వరాలతో బాధపడేవారు ఉండగా, అందులో 13 మంది టైఫాయిడ్ బారినపడ్డారని డాక్టర్లు తెలిపారు. ఇప్పటిదాకా డెంగీ, మలేరియా కేసులు నమోదు కాలేదన్నారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయని, సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని వారు వివరించారు.


ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రిలో పేషెంట్లు

విలయతాబాద్‌లో డెంగీ జ్వరాలు

మేడిపెల్లి(వేములవాడ): విలయతాబాద్‌లో డెంగీ కేసులు నమోదయ్యాయి. అప్రమత్తమైన మండల వైద్యాధికారి ప్రవీణ్‌చంద్ర ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇంటింటా పర్యటించి గ్రామస్తుల నుంచి బ్లడ్ శాంపిళ్లు సేకరించారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులతోపాటు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వైద్యాధికారులు శ్రీనివాస్, సత్యనారాయణ, సర్పంచ్ భత్తుల పోచమ్మ, ఉప సర్పంచ్ తోకల రమేశ్ పాల్గొన్నారు.

అన్ని సౌకర్యాలున్నాయి



ఆస్పత్రిలో ఓపీ పేషెంట్ల సంఖ్య పెరిగింది. తీవ్ర అస్వస్థతకు గురైన వారిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకుంటున్నాం. ఆస్పత్రిలో 24 గంటలపాటు వైద్యసేవలు అందిస్తున్నాం.

– నవీన్, డాక్టర్, ధర్మపురి


రాయికల్ : వివరాలు తెలుసుకుంటున్న వైద్యురాలు

ప్రబలుతున్న వ్యాధులు

రాయికల్(జగిత్యాల): స్థానిక వైద్య విధాన పరిషత్ ఆస్పత్రి పేషెంట్లతో రద్దీగా మారింది. బల్దియాతోపాటు 32 గ్రామాల ప్రజలకు ఇదే ఆస్పత్రి దిక్కు. రోజూ 150 మంది నుంచి 200మంది వరకు ఆస్పత్రిలో ఓపీ నమోదు చేసుకుంటున్నారు. ప్రధానంగా వైరల్ ఫీవర్‌తో బాధపడే వారే ఇందులో అధికంగా ఉంటున్నారని డాక్టర్లు చెబుతున్నారు. ఇప్పటివరకు ముగ్గురు డెంగీ బారినపడినట్లు గుర్తించామని అన్నారు. మలేరియా, విషజ్వరాలకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నట్లు ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ రమేశ్ తెలిపారు.

వైరల్ ఫీవర్ ఉంది



మూడు రోజులుగా జ్వరం వస్తుంది. ఇప్పుడే ఆస్పత్రికి వచ్చి డాక్టరుకు చూపించుకున్న. వైద్యం బాగానే అందిస్తున్నారు. కాస్త నయం అవుతంది.

– శ్రీనివాస్, రాయికల్

కట్టడి చేస్తాం



పట్టణం, గ్రామాల్లో ఇప్పుడిప్పుడే వైరల్ ఫీవర్స్ ప్రారంభమయ్యాయి. ఆదిలోనే వాటిని కట్టడి చేసేందుకు పకడ్బందీ చర్యలు తీసుకున్నాం.

– రమేశ్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్

పెరుగుతున్న ఇన్‌పేషెంట్ల సంఖ్య

మెట్‌పల్లిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి రోజూ 10 మంది నుంచి 15 మంది జ్వర పీడితులు వస్తున్నారు. కొందరికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు.. మందులు ఇచ్చి ఇళ్లకు పంపిస్తున్నారు. పరిస్థితి తీవ్రంగా ఉన్నవారిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకుంటున్నారు. గతమూడు నెలల్లో 224 టైఫాయిడ్, వైరల్ జ్వరాల కేసులు నమోదైనట్లు వైద్యులు చెబుతున్నారు. జూన్‌లో 47 మంది ఇవే వ్యాధులకు గురై చికిత్స పొందారు. జూలైలో 72 మంది అడ్మిట్ అయ్యారు. ఇందులో 64 మంది టైఫాయిడ్, ఎనిమిది మంది వైరల్ ఫీవర్‌తో బాధపడిన వారు ఉన్నారు. ఈ ఆగస్టు నెలలో ఇప్పటివరకు 105 మంది అడ్మిట్ అయ్యారు. ఇందులో 75 మంది టైఫాయిడ్, 30 మంది వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. రోజూ కనీసం ఐదుగురు ఇన్ పేషెంట్లుగా అడ్మిట్ అవుతుండగా, 10 మందికి పైగా ఔట్ పేషెంట్లు చికిత్స పొందుతున్నట్లు వైద్యులు తెలిపారు.


చికిత్స పొందుతున్న వృద్ధురాలు

చలిజ్వరం వచ్చింది



నాలుగు రోజుల కింద చలిజ్వరం వచ్చింది. ఎంతకూ తగ్గలే. శనివారం ఆస్పత్రికి వస్తే డాక్టర్ చూసి వైరల్ ఫీవర్ అన్నరు. ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు.

– లక్ష్మి, ఫ్యాక్టరీ చిట్టాపూర్

ఒళ్లంతా నొప్పులు



ఒళ్లంతా నొప్పులు, చేత కాకపోవడంతో సోమవారం ఆస్పత్రికి వచ్చా. డాక్టర్‌కు చూపించుకున్నాక జ్వరం బాగానే ఉందని చెప్పాడు. వెంటనే అడ్మిట్ చేసిండ్రు.

– గంగు, కమ్మర్‌పల్లి

జాగ్రత్తలు తీసుకోవాలి



వాతావరణ మార్పులతో జ్వరాలు వస్తున్నాయి. ఏమాత్రం అస్వస్థతకు గురైనా వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. ఆరోగ్యంపై అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

– సాజిద్ అహ్మద్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆస్పత్రి, మెట్‌పల్లి

దోమల మోత

కోరుట్ల: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి రోజూ సుమారు 250 మంది నుంచి 300 మంది వరకు ఔట్ పేషెంట్లు వస్తున్నారు. ఇందులో 35 మంది నుంచి 40 మంది వరకు టైఫాయిడ్, వైరల్ జ్వరాలతో బాధపడేవారు ఉంటున్నారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెంది ప్రజలపై దాడులు చేస్తున్నాయని, నీరు, ఆహారం కలుషితం కావడంతో టైఫాయిడ్, వైరల్ జ్వరాలు వస్తున్నాయని డాక్టర్లు చెబుతున్నారు. అయితే, ఇప్పటివరకు ఒక్క డెంగీ కేసు తమ దృష్టికి రాలేదని డాక్టర్ సునీత తెలిపారు.

నివారించాలి



ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లచుట్టూ నీరు వచ్చి చేరింది. ఇప్పుడు కూడా అక్కడక్కడావర్షపు నీరు నిలిచి ఉంది. అందులో దోమలు వృద్ధి చెందుతున్నాయి. వారం క్రితం జ్వరంతో ఇబ్బంది పడ్డా. మున్సిపాల్టీ వారు చర్యలు చేపట్టి దోమలను నిర్మూలించాలి.

– పెంట అశోక్, ప్రకాశంరోడ్డు, కోరుట్ల

వైరల్ ఫీవర్ వస్తోంది



ప్రస్తుతం టైఫాయిడ్, వైరల్ ఫీవర్ లక్షణాలకు ఎక్కువగా కనిపిస్తున్నాయి. డెంగీ కేసులు ఇప్పటికైతే నమోదు కాలేదు. ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని మందులు అందుబాటులో ఉన్నాయి. పేషెంట్లకు పూర్తిస్థాయి వైద్యసేవలు అందిస్తున్నాం.

– సునీత, వైద్యాధికారి, కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రి

గంజాయి మత్తు.. యువత చిత్తు

- ఇటిక్యాలలో యువకుడు బలి
- నా కొడుకులా ఎవరూ చనిపోవద్దు
- మృతుడి తండ్రి ఆవేదన




ఏదుల నవీన్(ఫైల్), మృతుడి తండ్రి శ్రీనివాస్

రాయికల్(జగిత్యాల): గంజాయి మత్తుకు బానిసై తన కుమారుడు ఏదుల నవీన్(23) మృతిచెందినట్లు ఇటిక్యాలకు చెందిన తండ్రి శ్రీనివాస్ మీడియా ఎదుట కన్నీటిపర్యంతమయ్యాడు. మీడియాతో ఆయన చెప్పిన మాటలు ఆయన మాటల్లోనే.. 'నా కొడుకు నవీన్. జగిత్యాలలో పదో తరగతి వరకు చదివాడు. అప్పుడే గంజాయికి అలవాటుపడ్డాడు. ప్రవర్తన మార్చుకోవాలని నవీన్‌కు ఎన్నోసార్లు సర్దిచెప్పాం. 18ఏళ్ల వయసు నిండగానే దుబాయి పంపించాను. అక్కడ రెండేళ్లు పనిచేశాక ఆర్నెల్ల క్రితం మా ఊరికి వచ్చాడు. స్నేహితులతో కలిసి రోజూ గంజాయి తాగాడు. ఆ మత్తులో నన్ను, నా భార్యను తీవ్రంగా కొట్టేవాడు. కొన్నిరోజుల తర్వాత నా కొడుకు విషయం బయటకు పొక్కింది. ఇంట్లోంచి బయటకు వెళ్లి తెలిసిన వారి ఇళ్లలో తదాచుకున్నాం. ఇటీవల నవీన్ ఆరోగ్యం క్షీణించింది. కొడుకు కావడంతో మనసు బాధించింది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించాం. అయినా, నయం కాలేదు. గంజాయి బాగా అలవాటు కావడంతో వైద్యానికి శరీరం సహకరించడం లేదని డాక్టర్లు చెప్పారు. ఈక్రమంలో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ సోమవారం నా కొడుకు చనిపోయాడు. నాలా ఏ తండ్రి కూడా ఇలాంటి కొడుకుతో బాధపడవద్దని వేడుకుంటున్నాను. ఇదే విషయంపై రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఒక్కగానొక్క కొడుకు గంజాయికి బానిసయ్యాడు.. మమ్మల్ని విడిచి వెళ్లాడు' అని మృతుడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

మత్తులో చిత్తు

గంజాయి పట్టణాల నుంచి గ్రామాల్లోకి చేరింది. మైనర్లు, విద్యార్థులను ఈ మహమ్మారి మత్తుకు బానిసలను చేస్తోంది. మత్తులో కొందరు వాహనాలపై దూసుకెళ్తూ ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు. కుటుంబ సభ్యులపై దాడులకు పాల్పడుతున్నారు. మైనర్లు, విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని కొందరు వ్యాపారులు గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తూ, రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. రా యికల్‌లో కిరాణా లు, పాన్‌షాపుల్లో గంజాయి విరివిగా విక్రయిస్తున్నారని తెలుస్తోంది. ప్రధానంగా పదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ చదివే విద్యార్థులు టార్గెట్‌గా విక్రయదారులు గంజాయి విక్రయిస్తున్నారు. తొలుత కొందరికే మత్తు పదార్థాలకు బానిసలు చేస్తూ ఆ తర్వాత ఆకతాయిలను ఎంచుకుంటున్నారు. సిగరెట్లు, కూల్ డ్రింక్‌బా టిల్‌లో హుక్కా తరహాలో గంజాయి తాగేలా చేస్తున్నారు. ఈ మత్తులో కొందరు రాత్రిపూట బైక్‌రైడింగ్ వంటి పోటీలూ నిర్వహిస్తున్నారు. జిల్లాలోని కో రుట్ల, సారంగాపూర్, రాయికల్, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, ధర్మపురి తదితర మండలాల్లో ప్రతీరోజు ఈ దందా సాగుతోంది.

ప్రత్యేక బృందాలను నియమించాం



గంజాయి నియంత్రణ కోసం జిల్లాలో స్పెషల్ టీంలను ఏర్పాటు చేశాం. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ కుమారులపై ప్రత్యేక దృష్టి సారించాలి. గంజాయి తాగితే నేరుగా మా దృష్టికి తీసుకు రావాలి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. తల్లిదండ్రులు సహకరిస్తేనే గంజాయిని నిర్మూలించే అవకాశం ఉంది.

– వెంకటస్వామి, డీఎస్పీ, జగిత్యాల

గణేశ్ ఉత్సవ కమిటీ ఎన్నిక

జగిత్యాలజోన్: రెడ్డి సంఘం గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా కొంగరి చిన్నారెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలిగా ఎడ్మల వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా నాగిరెడ్డి రజిత, సభ్యులుగా కొడిపల్లి మహేశ్వర్‌రెడ్డి, ముత్యాల రాంరెడ్డి, కడపటి సునీత, అయిలేని ప్రియాంక, కొంగరి శ్రీనివాస్‌రెడ్డి, మామిడి తిరుపతిరెడ్డి, నేవూరి శోభరాణి, రమ, రజత ఎన్నికయ్యారు.

చదవాలని ఉంది కానీ..

- అమ్మకు చదివించే స్థోమత లేదు
- దాతల కోసం ఇంజినీరింగ్ విద్యార్థి వినతి


తల్లి జలతో విద్యార్థి రంజిత్

కథలాపూర్(వేములవాడ): తండ్రి చిన్నతనంలో వదిలేయకాడు.. దీంతో తల్లి కూలీ పనులు చేస్తూ ఒక్కగానొక్క కొడుకును ఉన్నత చదువులు చదివించింది. ఇంటర్ పూర్తయ్యాక ఇంజినీరింగ్‌లో సీటు సాధించిన కుమారుడు.. హాస్టల్ వసతి, స్పెషల్ ఫీజు చెల్లించలేని స్థితిలో ఉండటంతో ఆర్థికంగా ఆదుకోవాని వేడుకుంటున్నాడు. వివరాలు.. తాండ్ర్యాల గ్రామానికి చెందిన సాదుల జలకు కుమారుడు రంజిత్ ఉన్నాడు. గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో పదోతరగతి వరకు చదివాడు. కథలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గతేడాది ఇంటర్ పూర్తిచేసి ఎంసెట్ రాశాడు. అందులో 42 వేల ర్యాంక్ సాధించాడు. హైదరాబాద్ ఐఏఆర్ఈ కళాశాలలో ఐటీ విభాగంలో సీటు వచ్చింది. అక్కడ ఉండటానికి వసతి, కాలేజీలో స్పెషల్ ఫీజు చెల్లించాల్సి ఉంది. కానీ, చేతిలో చిల్లి గవ్వలేదని విద్యార్థి రంజిత్, తల్లి జల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము రేకుల షెడ్డులో ఉంటూ బతుకుతున్నామని, రూ.వేలు చెల్లించేది ఎలా అని దీనంగా పేర్కొంటున్నారు. దాతలు ముందుకు వచ్చి సాయం చేస్తే ఇంజినీరింగ్ పూర్తిచేసి సాఫ్ట్‌వేర్ కావాలని ఆశగా ఉందని రంజిత్ వేడుకుంటున్నాడు.

ఎవరైనా దాతలు ఉంటే..

ఫోన్ పే నంబర్ : 70951 63443కు సాయం చేయాలని అభాగ్యులు అభ్యర్థిస్తున్నారు.

కలెక్టర్ చెప్పినా కరుణించలే..

జగిత్యాలటౌన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి తమ సమస్యలపై అధికారులకు దరఖాస్తు చేశారు. వివిధ సమస్యలపై 21 అర్జీలు అందినట్లు అదనపు కలెక్టర్ దివాకర తెలిపారు. ప్రజావాణికి వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. పలువురు అభాగ్యులు ఏమన్నారంటే..

ప్రజావాణి ఎదుట అభాగ్యుల ఆవేదన


దరఖాస్తు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ దివాకర

పట్టా మార్చారు



ఒడ్డెలింగాపూర్ శివారులోని సర్వేనంబరు 89లో నాపేరిట ఉన్న 2.37 ఎకరాలను భూరికార్డుల ప్రక్షాళనలో రెవెన్యూ అధికారులు ఇతరుల పేరిట పట్టా మార్చారు. నా పేరిట మార్చాలని కలెక్టర్‌కు విన్నవించిన. పొరపాటును సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. సిబ్బంది పట్టించుకోవడంలేదు. వృద్ధాప్యం, అంగవైకల్యంతో బాధపడుతున్న. ఆఫీసుల వెంట తిరిగే శక్తి లేదు. మేడం జోక్యం చసుకోవాలె.

– ముద్దం గంగారాం దంపతులు, చింతలూరు, రాయికల్

అభివృద్ధి చేయండి



ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆలయ అభివృద్ధికి సీఎం కేసీఆర్ కేటాయించిన రూ.600కోట్లతో పనులు వెంటనే మొదలు పెట్టాలి. కొండగట్టుకు వచ్చే భక్తుల సమస్యలు పరిష్కరించాలి.

– హిందూ వాహిని ప్రతినిధులు

పింఛన్ వస్తలేదు



ఆగస్టు 2022న నాకు కల్లుగీత కార్మికుల పింఛన్ మంజూరైంది. అధికారులు నాకు ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చిండ్రు. ఇంకా పింఛన్ రావడం లేదు. కలెక్టర్ చొరవ తీసుకోవాలె.

– బత్తిని సత్తయ్య, నాగులపేట, కోరుట్ల

పథకాల అమలుకు జిల్లా యంత్రాంగం కృషి

జగిత్యాల: ప్రజల చెంతకు వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలు చేరవేసేందుకు జిల్లాపాలన యంత్రాంగం కృషి చేస్తోందని, ఈ క్రమంలో జిల్లా అభివృద్ధిలో ప్రథమస్థానంలో నిలుస్తోందని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. సోమవారం 17మంది అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు(సెంట్రల్ టీం సభ్యులు) కలెక్టర్‌ను తన కార్యాలయంలో కలిశారు. గ్రామపంచాయతీల అభివృద్ధి, శిక్షణ, విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, సాంస్కృతిక కార్యక్రమాలను వీరు పర్యవేక్షించారు. ఈక్రమంలోనే వారు కలెక్టర్‌ను కలిశారు. యాస్మిన్ బాషా మాట్లాడుతూ, ఒకేచోట కలెక్టరేట్ నిర్మించామని, ఆర్థికంగా, విద్యుత్ పరంగా, పాలనాపరంగా జిల్లా మంచిపనితీరుతో ముందంజలో ఉందన్నారు. తండాలు గ్రామపంచాయతీలుగా మారాయని అన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు, కాళేశ్వరం, ఎస్సారెస్పీ జిల్లాలో ఉన్నాయని తెలిపారు. కాగా, వీరు జిల్లాలో ఐదు రోజుల పాటు పర్యటిస్తారు.


కలెక్టర్‌తో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు

క్లుప్తంగా

నృసింహునికి ఇత్తడి వస్తువులు బహూకరణ



స్వామివారికి అందించిన ఇత్తడి పందిరి

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలోని శ్రీశివాలయం, శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి ఓ భక్తుడు రూ.1.65 లక్షల విలువైన ఇత్తడి వస్తువులను హూకరించాడు. వంగపల్లి ప్రసాద్‌రావు–రజిత దంపతుల కూతురు, అల్లుడు శరత్‌కుమార్–అర్చన ఆస్ట్రేలియాలో ఉంటున్నారు. శివునికి అలంకరించే ఇత్తడి పందిరి, శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణాన్ని నిర్వహించే ఇత్తడి పీటను వారు విరాళంగా అందజేశారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసివాటిని స్వామివార్లకు అలంకరించారు.

దుబ్బరాజన్నకు శ్రావణ శోభ



ఆలయం ఎదుట బారులు తీరిన భక్తులు

సారంగాపూర్(జగిత్యాల): ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయానికి సోమవారం భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రావణంలో రెండోసోమవారం కావడంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. కోడెమొక్కులు, కుంపటి, గండదీపం, గజాశూలం, తలనీలాల సమర్పణ, నిలువెత్తు బంగారం(బెల్లం) పంచి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో అనూష, చైర్మన్ పొరండ్ల శంకరయ్య, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సమస్యలపై అవగాహన ఉంది



పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

కథలాపూర్(వేములవాడ):వేములవాడ నియోజకవర్గ సమస్యలపై తనకు అవగాహన ఉందని, 18 నెలలుగా ఈ ప్రాంతంలో పర్యటించి వాటిని తెలుసుకున్నామని బీఆర్‌ఎస్ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌ఆర్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కథలాపూర్ మండలంలోని కలిగోట సూరమ్మ ప్రాజెక్టు, సిరికొండ– తక్కళ్లపెల్లి వాగుపై వంతెన పనులు పూర్తిచేయాల్సి ఉందన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే రమేశ్‌బాబు చేసిన అభివృద్ధిని తాము కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గడీల గంగప్రసాద్, నాయకులు మామిడిపెల్లి రవి, గడ్డం భూమరెడ్డి, ఏజీబీ మహేందర్, దొప్పల జలేందర్, పిడుగు తిరుపతిరెడ్డి, దాసరి గంగాధర్, వినోద్‌రావు, రంజాన్, స్వామి, కిషన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పాలెపు రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట నిర్వాహకులపై కేసు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): గండిహనుమాన్ శివారు బొర్రన్న దాబా ప్రాంతంలో పేకాట స్థావరం నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమసాగర్ సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి దాడి చేసి రూ.74,840 నగదు, 9 సెల్‌ఫోన్లు, 4 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకుని, 14మంది పేకాటరాయుళ్లు, మెట్‌పల్లి మండలం మేడిపెల్లి గ్రామానికి చెందిన నిర్వాహకుడు కొట రాజు, దాబా నిర్వాహకుడు బొర్రన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

తేట తెలుగు.. తేనెలొలుకు

- భావోద్వేగాలను మాతృభాషలోనే హాయిగా వెల్లడించగలం
- అమ్మభాషకు పట్టం కడదాం
- నేడు తెలుగు భాషా దినోత్సవం

మాతృభాష తృణీకారం..
మాతృదేవి తిరస్కారంతో సమానం
– సినీ కవి, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సి.నారాయణరెడ్డి

అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు
– సకిలించు ఆంధ్రుడా..
చావవెందుకురా..! – ప్రజాకవి కాళోజీ



గిడుగు-పిడుగు పుస్తక ముఖచిత్రం

విద్యానగర్/కరీంనగర్ కల్చరల్(కరీంనగర్): మనిషి జీవన విధానంలో ఆయువుపట్టు వంటిది మాతృభాష. అందులో జ్ఞానాన్ని పొందలేనివారిలో అభివృద్ధి తక్కువగా ఉంటుందని, వ్యక్తిత్వ వికాసం, మేధాపరమైన ప్రగతి మందగిస్తాయని అనేక పరిశోధనల్లో వెల్లడైంది. దేశభాషలందు తెలుగు లెస్స అని, ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని ప్రశంసలందుకున్న తెలుగుకు చాలా ప్రాధాన్యం ఉంది. ఈ భాషలోని నుడికారాలు, సామెతలు, జాతీయాలు, లోకోక్తులు వేటికవే ప్రత్యేకం. అమ్మ భాషలోనే మన భావోద్వేగాలను హాయిగా వెల్లడించగలుగుతాం. తెలుగు భాష ఉన్నతి కోసం విశేష కృషి చేసిన గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి(ఆగస్టు 29న) సందర్భంగా ఏటా ఈరోజున తెలుగు భాషా దినోత్సవం జరుపుకుంటున్నాం.

ప్రాధాన్యత కోల్పోతున్న తెలుగు

గిడుగు వెంకట రామ్మూర్తి కృషితో తెలుగుకు కొత్త వెలుగులు వచ్చినప్పటికీ పాలకుల నిర్వాకంతో అమ్మ భాష రోజురోజుకూ నిరాదరణకు గురవుతోంది. తెలుగులో రాయడం ఆత్మన్యూనతగా, ఆంగ్ల మాధ్యమంలో చదవడం నాగరికంగా మారిన కారణంగా సొంత గడ్డపైనే తెలుగు పరాయిదయిపోయింది. అధికార భాషగా తెలుగును అమలు చేయాలన్నది ఆచరణలో అంతంతమాత్రంగానే ఉంది. తెలుగు ప్రజల విజ్ఞప్తి మేరకు 2011లో కేంద్ర ప్రభుత్వం తెలుగును ప్రాచీన భాషగా ప్రకటించింది. తెలుగువారి ప్రస్తావన మహాభారతం, బౌద్ధుల కాలంలోనూ ఉంది.

తెలుగు మహాసభలు

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారిని ఒక వేదికపై తీసుకువచ్చి, తెలుగు భాషా సంస్కృతి, చరిత్ర, కళలను తెలుసుకొని, స్నేహ సంబంధాలను వృద్ధి చేసుకోవాలన్న లక్ష్యంతో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహాసభలకు శ్రీకారం చుట్టింది. 1975 నుంచి 2012 వరకు అప్పటి అంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2017 మే 2న తెలంగాణ సాహితీ అకాడమీ ఏర్పాటు చేసింది. సీఎం కేసీఆర్ ఆదేశాలతో అదే ఏడాది అక్టోబర్‌లో తెలుగు మహాసభలు నిర్వహించారు. అప్పటి నుంచి మళ్లీ వాటి ఊసే లేకుండా పోయింది.

కవులు చైతన్యం తీసుకురావాలి



ఆంగ్ల భాష వ్యామోహంలో పడి, తెలుగు భాషను విస్మరిస్తున్నాం, ఉద్యోగ నియామకాల్లో తెలుగు మీడియంలో చదివినవారికే ప్రాధాన్యం ఇవ్వాలి. కోర్టు తీర్పులు తెలుగులో వెలువడేలా చూడాలి. కవులు, రచయితలు తమ రచనల ద్వారా సమాజంలో చైతన్యం తీసుకురావాలి. – దాస్యం సేనాధిపతి, ప్రముఖ కవి, విమర్శకుడు

తెలుగులో సాంకేతిక విద్యనందించాలి



ఆలోచనలను వ్యక్తపరిచే సాధనం అమ్మ భాష. నేడు తెలుగులో మాట్లాడటమే చిన్నతనంగా భావించడం బాధాకరం. సాంకేతిక విద్యను సైతం తెలుగు మీడియంలో అందించాలి. తెలుగు మాధ్యమంలో చదివే విద్యార్థులకు ప్రత్యేక వెయిటేజీ ఇవ్వాలి. – గాజుల రవీందర్, ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు

చిరస్మరణీయుడు.. గిడుగు



గిడుగు చిరస్మరణీయుడు. ఆయన వ్యవహారిక భాషోద్యమం వల్ల ఆధునిక సాహిత్యం కొత్త సొగసులు సంతరించుకుంది. విశ్వవిద్యాలయాల్లో వాడుక భాష రాజ్యమేలుతోంది. పత్రికలూ పెరిగాయి. అక్షరాస్యత పెరిగింది. – నంది శ్రీనివాస్, సాహితీ గౌతమి అధ్యక్షుడు

మాతృభాష నేర్పించాలి



తెలుగు భాషను పరిరక్షించాలి. ప్రాథమిక చదువులు మాతృభాషలో కొనసాగితేనే ఆలోచన శక్తి, ప్రశ్నించేతత్వం విద్యార్థుల్లో పెరుగుతాయి. తల్లిదండ్రులు ఆంగ్లంపై ఉన్న వ్యామోహాన్ని తగ్గించి, పిల్లలకు మాతృభాష నేర్పించాలి. – కేఎస్.అనంతాచార్య, సమైక్య సాహితీ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్

కొత్త తరానికి అందించాలి



భాషా నుడికారాలు, సాహిత్య సౌరభాలను కొత్త తరానికి అందించాలి. ప్రపంచీకరణతో మన భాషా సంస్కృతులను రక్షించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆంగ్ల భాష వ్యామోహం నుంచి మాతృభాష వైపు మళ్లాల్సిన అవసరం ఉంది. – కొత్త అనిల్‌కుమార్, తెలంగాణ రచయితల సంఘం, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు

పరిపాలనలో అమలు చేయాలి



తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగావకాశాల్లో రిజర్వేషన్ వర్తింపజేయాలి. వారికి ప్రోత్సాహకాలు ఇవ్వాలి. పాలకులు పరిపాలనలో తెలుగును పక్కాగా అమలు చేయాలి. అందరం అమ్మ భాషకు పట్టం కడదాం. – మాడిశెట్టి గోపాల్, సమైక్య సాహితీ అధ్యక్షుడు, కరీంనగర్

అంతర్గాం ఈతవనాలపై విస్తృత ప్రచారం

- హైదరాబాద్ అవుటర్ రింగ్‌రోడ్డు సమీపంలో బోర్డుల ఏర్పాటు



అటవీశాఖ ఏర్పాటు చేసిన ఈతవనాల బోర్డు

సారంగాపూర్(జగిత్యాల): అంతర్గాం గ్రామానికి అటవీశాఖ ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. గ్రామ శివారులో గౌడకులస్తులు 10 ఎకరాల్లో పెంచుతున్న ఈతవనాలపై హైదరాబాద్ అవుటర్ రింగ్‌రోడ్డు సమీపంలో ప్రత్యేకంగా బోర్డులు ఏర్పాటు చేసింది. కోటి వృక్షార్చనలో భాగంగా ప్రభుత్వం ఒక్కరోజే కోటి మొక్కలు నాటింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహించింది. ఇందులో భాగంగా అటవీశాఖ భారీ హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, పోస్టర్ల ద్వారా ప్రచారం చేసింది. ఇందులో భాగంగా హైదరాబాద్ అవుటర్ రింగ్‌రోడ్డు సమీప తెలంగాణ పోలీస్ అకాడమీ జంక్షన్ సమీపంలోని మంచిరేవుల ఫారెస్ట్ పార్క్ ఏర్పాటు చేసింది. జగిత్యాల నియోజకవర్గంలోని అంతర్గాం ఈతవనాల పోస్టర్లను ఏర్పాటు చేసింది. 2014లో గౌడ సొసైటీకి 40ఎకరాలు ఉండగా, అందులోని 10 ఎకరాల్లో ఉపాధిహామీ ద్వారా 5 వేల ఈత మొక్కలతో ఈత ప్లాంటేషన్ ఏర్పాటు చేసింది. మాజీ జెడ్పీటీసీ మాకునూరి జితేందర్‌రావు కృషి మేరకు సంగారెడ్డి నర్సరీ నుంచి మొక్కలు తెప్పించారు. డ్రిప్ ఏర్పాటు చేసి నీటిని అందించారు. ప్రస్తుతం ఈతవనం ఏపుగా పెరిగింది. ఈత కల్లుతో గీతకార్మికులు ఉపాధి పొందుతున్నారు. జిల్లా అటవీశాఖాధికారి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ, ఈతవనాలు ఏర్పాటు చేసేవారికి, పర్యావరణం కాపాడే విషయంపై ప్రచారంలో ప్రాధాన్యం కల్పించామన్నారు.

మట్టి గణపతులనే పూజించాలి

జగిత్యాల: మట్టి గణపతులనే పూజించి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని జాతీయ హరితదళం తెలంగాణ ప్రాజెక్ట్ అధికారి విద్యాసాగర్ అన్నారు. స్థానిక ఓల్డ్ హైస్కూల్‌లో సోమవారం జాతీయ హరిత దళం, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు మట్టి గణపతులపై అవగాహన కల్పించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాల ద్వారా జలచరాల ప్రాణాలకు ముప్పు ఉంటుందని, నీరు కలుషితమవుతుందని అన్నారు. వినాయక చవితికి సహజమైన బంకమట్టితో తయారుచేసిన విగ్రహాలనే పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాస్, పాఠశాల ఎన్జీసీ ఇన్‌చార్జి ఆనందరావు, ప్రధానోపాధ్యాయుడు రామానుజం, ఉపాధ్యాయులు దేవయ్య, విద్య, పద్మ, మల్లికార్జున్, అనిత, హరిత, శ్రీనివాస్, సురేందర్, అరుణ, అమల, రాజేశ్ పాల్గొన్నారు.

మానవహారంతో నిరసన

జగిత్యాలటౌన్: తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని రెండో ఏఎన్‌ఎంల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్ల మధురిమ కోరారు. నిరవధిక సమ్మెలో భాగంగా 13వ రోజు సోమవారం తహసీల్ చౌరస్తాలో రెండోఏఎన్‌ఎంలు మానవహారం నిర్మించి నిరసన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించే వరకూ శాంతియుతంగా ఆందోళన కొనసాగిస్తామని అన్నారు. రెండో ఏఎన్‌ఎంలు గూడూరి జయప్రద, మమత, సుప్రియ, నీరజ, పద్మ, రాజమని, మేరి, ఎలిజబెత్, శిరీష, ప్రశాంతి, శైలజ, సునీత, అహల్య,షాలిమున్నీసా, శిరీషతో పాటు పెద్ద సంఖ్యలో ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఓసీపీలో డోజర్ ఢీకొని కాంట్రాక్టు కార్మికుని మృతి

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధి ఓసీపీ–3 ఓబీ కంపెనీలో జరిగిన ప్రమాదంలో గంగాప్రసాద్ (24) ప్రైవేట్ డ్రిల్ ఆపరేటర్ మృతి చెందాడు. గంగాప్రసాద్ ఓసీపీ–3 పైలట్ క్వారీ వద్ద సోమవారం డ్రిల్ పనులు చేస్తున్నాడు. డ్రిల్లింగ్ నడిచేందుకు ఆ ప్రాంతాన్ని క్లీన్ చేసేందుకు డోజర్ వద్దకు బయల్దేరాడు. అతడిని గమనించని డోజర్ ఆపరేటర్ యంత్రాన్ని ముందుకు నడపడంతో అతనిపై నుంచి వెళ్లింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన గంగాప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయాన్ని బయటకు పొక్కనీయకుండా శవాన్ని కరీంనగర్ ఆసుపత్రికి.. అక్కడ నుంచి పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చి పోస్టుమార్టం నిర్వహించారు. యాజమాన్యం, కార్మిక సంఘాలకు సమాచారం ఇవ్వకుండానే శవాన్ని మాయం చేశారని కార్మిక సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఓసీపీని మరో కేజీఎఫ్‌గా మార్చేందుకు ఓబీ కాంట్రాక్టర్లు ప్రయత్నిస్తున్నారని, ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశాయి.

హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవం

జగిత్యాలజోన్: అప్పు ఇవ్వనందుకు స్నేహితుడిని హత్య చేసిన కేసులో ముగ్గురికి యావజ్జీవశిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.5,000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ సోమవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్ కథనం ప్రకారం.. బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన అర్మూరి గంగాధర్ వృత్తి రీత్యా చేపలు పట్టుకుని జీవించేవాడు. నర్సింహులపల్లె గ్రామానికి చెందిన చెర్లపల్లి నారాయణ, అప్పాల రవి, బోరే దేవరాజం, అర్మూరి గంగాధర్ మంచి స్నేహితులు. ఈ నలుగురు రోజూ కలిసి మద్యం తాగుతారు. ఏపనికైనా వీరే వెళ్లేవారు. ఈ నేపథ్యంలో గంగాధర్ తన ఇంటి సమీపంలోని భూమిని రూ.18 లక్షలకు విక్రయించాడు. కొనుగోలు చేసినవారు అడ్వాన్స్‌గా రూ.5 లక్షలు ముట్టజెప్పారు. అప్పటినుంచి తమకు కొంత అప్పు ఇవ్వాలని మిగతా ముగ్గురు స్నేహితులు గంగాధర్‌ను వేధించారు. అప్పు ఇవ్వకపోతే తనను చంపుతామని బెదిరిస్తున్నారని గంగాధర్ తన భార్యతో చెబుతూ బాధపడ్డాడు. అలాంటివారితో స్నేహం చేయొద్దని అతడి భార్య భార్య భూలక్ష్మి చెబుతూ వచ్చింది. ఈ క్రమంలో నలుగురు ఏదోఓసారి కలిసి మద్యం తాగేవారు. ఈక్రమంలో 30 డిసెంబర్ 2019న గంగాధర్ తన ఇంటి వద్ద ఉండగా, మిగతా ముగ్గురు వచ్చి కల్లు తాగుదామని బయటకు తీసుకెళ్లారు. రాత్రయినా గంగాధర్ ఇంటికి రాలేదు. ఈలోగా కల్లు మండువా వద్ద గంగాధర్ తీవ్ర రక్తగాయాలతో పడిఉన్నారని ఎవరో వచ్చి భార్యకు సమాచారం ఇచ్చారు. ఆమె వెళ్లి చూడగా గంగాధర్ చనిపోయి ఉన్నాడు. తన భర్తకు కల్లు తాగించి, స్నేహితులైన ముగ్గురు హత్య చేశారని భార్య భూలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రాజేశ్ కేసు దర్యాప్తు చేశారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు కిరణ్‌కుమార్, రామకృష్ణ బలమైన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టారు. పరిశీలించిన జడ్జి.. చెర్లపల్లి నారాయణ, అప్పాల రవి, బోరే దేవరాజానికి యావజ్జీవశిక్షతో జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

యువకుడి ఆత్మహత్య



శ్రీనివాస్(ఫైల్)

గొల్లపల్లి(ధర్మపురి): లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన చింతపండు శ్రీనివాస్(26) ఉరివేసుకుని మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్.. రెండేళ్లుగా ఓ యువతితో ప్రేమాయణం సాగిస్తున్నాడు. ఇటీవల ప్రేమ విఫలం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో ఆదివారం ఉదయం ఇంట్లోంచి బయటకు వెళ్లాడు. రాత్రి వరకూ తిరిగి ఇటికి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెతికారు. సోమవారం ఉదయం గ్రామ శివారులోని శివాలయం వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. దీంతో ఆమె బోరున విలపించింది. ప్రేమ విఫలం కావడంతోనే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. కాగా, హన్మవ్వ–రాజయ్య దంపతులకు ఇద్దరు కొడుకులు. పెద్దకొడుకు అనారోగ్యంతో గతంలోనే మృతిచెందాడు. భర్త కూడా గతంలోనే చనిపోవడంతో తల్లి అన్నీతానై శ్రీనివాస్‌ను పోషిస్తోంది. అతడు కూడా చనిపోవడంతో తల్లి హన్మవ్వ రోదిస్తున్న తీరు కంటతడి పెట్టించింది.

సోమన్‌పల్లిలో..

జగిత్యాలక్రైం: సోమన్‌పల్లి గ్రామానికి చెందిన గర్మకుర్తి గంగన్న (47) ఆదివారం రాత్రి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గంగన్న గత కొంతకాలం క్రితం మానసికస్థితి కోల్పోయాడు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చూపించినా ఆరోగ్యం కుదుట పడలేదు. దీంతో పురుగుల మందుతాగి చనిపోయాడు. మృతుడి భార్య అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

బెదిరించిన వారిపై కేసు

జగిత్యాలక్రైం: కల్లెడకు చెందిన మంచాల శ్రీనివాస్‌పై భూ వివాదంలో బెదిరించి దాడికి యత్నించిన మంచాల లక్ష్మీనారాయణ, మంచాల రాజేశం, అంకతి రాజంపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. మంచాల శ్రీనివాస్ భూమి వద్దకు వెళ్లే దారి విషయంలో దారి వెంట వెళ్లవద్దని చెప్పినందుకు మంచాల లక్ష్మీనారాయణ, రాజేశం, అంకతి రాజన్న కలిసి శ్రీనివాస్‌ను సోమవారం బెదిరించడంతో పాటు, దాడికి యత్నించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

కుక్కల దాడిలో కోళ్లు మృతి

వెల్గటూర్(ధర్మపురి): మండల కేంద్రంలో కుక్కలు బీభత్సం సృష్టిస్తున్నాయి. సోమవారం దుబ్బలవాడలో బండమీది గోపికి చెందిన ఎనిమిది పెంపుడు కోళ్లపై దాడి చేసి చంపేశాయి. గుంపులుగా తిరుగుతూ రోడ్డుపై కనిపించే ద్విచక్ర వాహనదారులు, కాలినడకన వెళ్లేవారిని వెంటపడి దాడిచేస్తున్నాయి. ఇళ్లలో చొరబడి పెంపుడు జంతువులపై దాడి చంపేస్తున్నాయి.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

- సాంఘిక సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఈశ్వర్

మల్లాపూర్(కోరుట్ల): తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుతో కలిసి రూ.10 కోట్ల వ్యయంతో చేపట్టిన సోమేశ్వర కొండ ఘాట్ రోడ్డు, రూ.2.50 కోట్లు వెచ్చించి చేపట్టిన వడ్డెరకాలనీ రోడ్డు హైలెవల్ వంతెన పనులకు సోమవారం ఆయన ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడారు. గత పాలకులు వ్యవసాయ రంగాన్ని, రైతులను సంక్షేమాన్ని విస్మరించారని విమర్శించారు. సీఎం కేసీఆర్ రైతుల ప్రయోజనాలే ధ్యేయంగా సరిపడా విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తున్నారని, వ్యవసాయరంగానికి 24గంటలపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నారని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఈ పథకాలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. జెడ్పీ చైర్పర్సన్ దావ వసంత, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ అడగకున్నా వరాలు ఇస్తారన్నారు. రాబోయే ఎన్నికల్లో మూడు అసెంబ్లీ స్థానాల్లో బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆర్డీవో మధు, డీఎస్పీ రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కోమ్ముల జీవన్‌రెడ్డి, తహసీల్దార్ వీర్‌సింగ్, ఎంపీడీవో జగదీశ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో దూసుకు పోతోంది

మెట్‌పల్లిరూరల్: అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం ముందుకుదూసుకెళ్తోందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పెద్దాపూర్, కొండ్రికర్లలో హైలెవల్ వంతెనలు, ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ వసంతతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మోటార్లకు మీటర్లు పెట్టాలనే బీజేపీ నాయకులను నమ్మవద్దని కోరారు. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి ఏమీ జరగలేదన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ వసంత మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచాక పసుపు బోర్డు ఏర్పాటు చేస్తానని బాండ్ పేపర్ రాసిచ్చిన ఎంపీ అర్వింద్ ఇప్పుడు ఆ ఊసే ఎత్తడంలేదన్నారు. ఎంపీపీ మారు సాయిరెడ్డి, సర్పంచులు రవి, రాజగంగు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ పథకాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్/రాయికల్: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలు ఇంటింటికీ చేరాయని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. జగిత్యాల రూరల్ మండలం ధర్మారం గ్రామానికి చెందిన గోస్కుల దేవేంద్రకు రూ.18వేల విలువైన సీఎం సహాయనిధి చెక్కు అందజేశాక ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కు పట్టం కట్టాలని కోరారు. భూపతిపూర్ సర్పంచ్ చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు, నాయకులు జక్కుల రంజిత్, పృథ్వీరాజ్, శశి, గిద్దె శంకర్, గిద్దె రాజు, దండిగె శంకర్ పాల్గొన్నారు.

కాళేశ్వరం నీటితో పెరిగిన సాగు విస్తీర్ణం

జగిత్యాలరూరల్: కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం ద్వారా బీళ్లు సాగులోకి వచ్చాయని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. అంతర్గాంలో రూ.6.63 లక్షల వ్యయంతో నిర్మించిన ఎస్సీ సంఘం కమ్యూనిటీ హాల్, రూ.18.80 లక్షలు వెచ్చించి నిర్మించిన మోడల్‌కాలనీ కమ్యూనిటీ హాల్, వృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల కోసం మొబైల్ మెడికేర్ యూనిట్, ఉచిత వైద్య సంచార వాహనం ద్వారా వైద్యసేవలు ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ నక్కల రాధ, రైతుబంధు కన్వీనర్ రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్లు మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు, సర్పంచ్ బోనగిరి నారాయణ, ఎంపీటీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు. కాగా, హస్నాబాద్‌కు చెందిన 20 మంది నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. సర్పంచ్ లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీ దమ్మ మల్లారెడ్డి పాల్గొన్నారు.

యువత క్రీడల్లో ప్రతిభ చూపాలి

జగిత్యాలటౌన్: చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ కనబరిచి జగిత్యాలకు క్రీడా హబ్‌గా పేరుతేవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సూచించారు. జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా స్థానిక మినీస్టేడియంలో ఏర్పాటు చేసిన క్రీడల అవగాహన కార్యక్రమం 'చలో మైదాన్'లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. క్రీడలను ప్రోత్సహించేందుకు జిల్లాలో 131క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశామని చెప్పారు. కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా, మున్సిపల్ చైర్మన్ గోళి శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ లక్ష్మీనారాయణ, జిల్లా యువజన, క్రీడల అధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

సారంగాపూర్(జగిత్యాల): ఒడ్డెరకాలని గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు పల్లపు బాపిరాజు, నాయకులు చిట్నేని రవీందర్‌రావు, మద్దెల ఆనంద్, రవీందర్‌రెడ్డి, చిన్నరెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే ధ్యేయం

జగిత్యాల: పట్టణాభివృద్ధే ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. 'మన వార్డు మన ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి 14, 15 వార్డుల్లో ఆయన పర్యటించారు. గత పాలకుల నిర్లక్ష్యంతో పట్టణం అభివృద్ధికి దూరంగా ఉందని విమర్శించారు. మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు కూతురు పద్మ, తోట మల్లికార్జున్, శ్రీనివాస్, ఆనందరావు పాల్గొన్నారు.

శివ..శివ

వేములవాడ: శ్రావణ సోమవారం రాజన్నను 35 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. దర్శనానికి దాదాపు ఐదు గంటల సమయం పట్టింది. ఎండ తీవ్రంగా ఉండడంతో ఆలయ పరిసరాల్లో భక్తులు పరుగులు తీశారు. ఉక్కపోతతో క్యూలైన్లలో ఇబ్బందులు పడ్డారు. పారిశుధ్యం నిర్వహణ సరిగ్గా లేని ఆలయ పరిసరాల్లో దుర్వాసన వచ్చింది. ఈవో కృష్ణప్రసాద్, ఏఈవోలు శ్రీనివాస్, ప్రతాప నవీన్, పర్యవేక్షకులు తిరుపతిరావు, అల్లి శంకర్, శ్రీరాములు, పీఆర్వో చంద్రశేఖర్ ఏర్పాట్లను పరిశీలించారు.

